క్లుప్తంగా

వైద్య శిబిరం అభినందనీయం


రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ రాధిక

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల గ్రామంలోని యర్రం చినపోలిరెడ్డి ప్రభుత్వం ఆసుపత్రిలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఒంగోలు విశ్వాస్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి డాక్టర్లు యర్రం నాగార్జునరెడ్డి, కొండారెడ్డి రాధిక వైద్య శిబిరంలో పాల్గొని ఉచితంగా 200 మంది రోగులను పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యశాల వైద్యాధికారి ఎస్వీ సుబ్బారావు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రోబస్ క్లబ్ అధ్యక్షుడిగా పున్నయ్య


ప్రోబస్ క్లబ్ నూతన కార్యవర్గం

వేటపాలెం: ప్రోబస్ క్లబ్ నూతన అధ్యక్షుడుగా ఆవుల పున్నయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులోగల రోటరీ కమ్యూనిటీ హాల్లో క్లబ్ సరసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశంలో క్లబ్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా పల్లపోలు నాగ మనోహర్ లోహియా, కార్యదర్శిగా బూసం షణ్ముఖేశ్వరరావు, కోశాధికారిగా బీరక సుబ్రహ్మణ్యంలను ఎన్నుకొన్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ క్లబ్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఆర్జేడీ స్వర్ణ ప్రయాగరావు, గొల్లపూడి సీతారాం, కొసనం నాగమాంబ పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొని కంటైనర్ బోల్తా

మేదరమెట్ల: డ్రైవర్ మద్యం మత్తులో ఉండటంతో అదుపు తప్పిన కంటైనర్ డివైడర్‌ను ఢీకొని రోడ్డుపై బోల్తా పడింది. ఈఘటన మేదరమెట్ల ఉత్తర బైపాస్ సమీపంలో ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. శివకాశి నుంచి వైజాక్‌కు వెళ్తున్న కంటైనర్ 16 నెంబరు జాతీయ రహదారి మేదరమెట్ల ఉత్తర బైపాస్ సమీపంలోకి రాగానే డ్రైవర్ పుష్పేంద్ర మద్యం మత్తులో ఉండటంతో కంటైనర్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. దీంతో లారీ రోడ్డుపై అడ్డంగా బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలు కాగా అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎన్‌హెచ్ పోలీసులు రోడ్డుకు అడ్డంగా పడిన కంటైనర్‌ను క్రేన్‌ల సాయంతో పక్కకు తీయించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

దాడి కేసులో నిందితుల అరెస్టు

మార్టూరు: దాడి కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. మార్టూరు జాతీయ రహదారిపై జొన్నతాళి సెంటర్‌లోని సూర్య డాబా వద్ద మే 10 రాత్రి జరిగిన దాడికి సంబంధించి ముగ్గురు నిందితులను శనివారం రాత్రి అరెస్ట్ చేసినట్లు మార్టూరు సీఐ ఎస్‌కే టీ ఫిరోజ్ ఆదివారం తెలిపారు. యద్దనపూడి మండలానికి చెందిన కొందరు వ్యక్తులపై ఆదే మండలానికి చెందిన మరో వర్గం డాబా వద్ద దాడి చేసిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై గోరంట్ల సాంబశివరావు అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుపై మే 11న పోలీసులు 13 మందిపై కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా మండలంలోని చింతపల్లిపాడు గ్రామానికి చెందిన మార్నెళ్ల గోపాలకృష్ణ, జంపని రాజేష్‌లతో పాటు అదే మండలం యనమదల గ్రామానికి చెందిన పోపూరి ఆదిబాబులను శనివారం రాత్రి 10.30 గంటలకు ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం కీసర టోల్ ప్లాజా వద్ద అరెస్టు చేసి ఆదివారం అద్దంకి కోర్టుకు తరలించినట్లు ఆయన తెలిపారు.

అద్దంకి రోటరీ క్లబ్‌కు అవార్డు


అవార్డు అందుకుంటున్న రోటరీ సభ్యులు

అద్దంకి రూరల్: రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ అద్దంకి సూపర్‌స్టార్ క్లబ్ అవార్డు వరించింది. ఆదివారం గుంటూరులో జరిగిన రోటరీ డిస్ట్రిక్ట్ 3150 క్లబ్ వార్షికోత్సవ సమావేశంలో 113 క్లబ్‌లల్లో సూపర్‌స్టార్ క్లబ్ అవార్డుని అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసరావు అందుకున్నారు. ఆంధ్రా రీజియన్‌లో ఉత్తమ ద్వితీయ ప్రెసిడెంట్ అవార్డు కూడా శ్రీనివాసరావు అందుకున్నారు. కార్యక్రమానికి అద్దంకి నుంచి 35 మంది సభ్యులు పాల్గొన్నారు.

ఇక ఇంటి వద్దకే.. పౌష్టికాహారం


పోషకాహారాన్ని అందిస్తున్న సీడీపీవో ఝాన్సీ


అంగన్‌వాడీ కేంద్రంలో ఆహారాన్ని రుచి చూస్తున్న గర్భిణులు

- జులై 1 నుంచి అమలు
- వైఎస్సార్ సంపూర్ణ పోషణతో మహిళలకు మరింత ఆరోగ్యం
- ఇంకొల్లు ప్రాజెక్టులో ఎనిమిది సెక్టార్లు

కారంచేడు: మనిషి ఆరోగ్యం తినే ఆహారంపైనే ఆధారపడి ఉంటుంది. విద్య, వైద్యం, ఆరోగ్యం ఎంత ముఖ్యమో ప్రజలకు ఆహారాన్ని అందించడం ప్రభుత్వాల బాధ్యత. అందులో ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు చిన్నారులు ఆరోగ్యంగా ఉంటేనే మెరుగైన సమాజాన్ని మనం చూడగలం. మధ్యాహ్న సమయంలో అంగన్‌వాడీ కేంద్రాలకు రాలేక అవస్థలు పడుతున్న గర్భిణులు, బాలింతలకు మంచి పౌష్టికాహారం అందించేందుకు వారికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీపి కబురు అందించింది. గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు ఇంటికి కొంత దూరంగా ఉండటం వలన, మధ్యాహ్నం ఎండగా ఉంటుందనో, ఇంట్లో ఎవరూ లేరనో వంటి అనేక కారణాలు, సమస్యలతో అంగన్‌వాడీ కేంద్రాలకు రాలేకపోతున్న వారికి జులై 1వ తేదీ నుంచి 'ఇక ఇంటికే వైఎస్సార్ సంపూర్ణ పోషణ' కిట్లు పంపిణీకి సిద్ధం చేస్తున్నారు. ఐసీడీఎస్ ఇంకొల్లు ప్రాజెక్టు పరిధిలో మూడు మండలాలున్నాయి. కారంచేడు, ఇంకొల్లు, చినగంజాం మండలాల్లో కారంచేడు, స్వర్ణ, ఇంకొల్లు, ఇడుపులపాడు, పావులూరు, చినగంజాం, పెదగంజాం, సంతరావూరు సెక్టార్లలో సుమారు 680 మంది గర్భిణులు, 695 మంది బాలింతలున్నారు. వీరందరికీ ఈ పథకం ద్వారా ప్రతి రోజూ సంపూర్ణ పోషకాహారం అందించేలా సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారు. వీరికి ప్రధానంగా రక్తహీనత, ఐరన్ లోపాలు ఎక్కువగా ఉంటుంటాయి. వీటిని అధిగమించడానికి ఇప్పటి వరకు పౌష్టికాహారం అందించినట్లు కాకుండా ఇప్పుడు నేరుగా వారి ఇంటికి ప్యాకెట్ల రూపంలో అందించి ఆ పౌష్టికాహారాన్ని వారు మాత్రమే తీసుకొనేలా వారికి అవగాహన కల్పిస్తారు. కిట్లలో రాగి పిండి, అటుకులు, బెల్లం, ఖర్జూరాలు, చిక్కీలు, పాలు, గుడ్లు ఉంటాయి. ఇప్పటి వరకు బాలింతలు, గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తే వారికి ఆకుకూర పప్పు, పాలు, కోడిగుడ్లు, ఆహారంగా వండి పెడుతున్నారు.

జులై 1వ తేదీ నుంచి అందించే కిట్లలో..
1 కేజీ కందిపప్పు,
అరకేజీ నూనె
25 గుడ్లు
5 లీటర్ల పాలు
2 కేజీల రాగిపిండి
2 కేజీల జొన్న పిండి
1 కేజీ అటుకులు
250 గ్రాముల ఎండు ఖర్జూరం
250 గ్రాముల బెల్లం
250 గ్రాముల వేరుశెగన చిక్కీలు



పకడ్బందీగా అమలు చేస్తాం..



వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని మా ప్రాజెక్టు పరిధిలో పకడ్బందీగా అమలు చేస్తాం. జులై 1వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఈ పథకం ద్వారా అనేక ప్రయోజనాలున్నాయి. ఇప్పటికే ప్రతి అంగన్‌వాడీ కేంద్రం వద్ద అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. కార్యకర్తలకు కూడా శిక్షణనిచ్చాం. రక్తహీనతతో బాధపడే వారిని గుర్తించి వారి పట్ల మరింత శ్రద్ధ చూపేలా పనిచేస్తాం.

– తిరుమలశెట్టి ఝాన్సీ, సీడీపీవో, ఇంకొల్లు ప్రాజెక్టు

ఇంటి వద్దకే పథకం అందడం బాగుంది..



గతంలో మేము అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి అక్కడే పౌష్టికాహారం తీసుకోవాల్సి వచ్చేది. దీని వలన కొంతమంది వెళ్లే వారు కాదు. పోషకాహారం వారికి సక్రమంగా అందించే వీలు తక్కువగా ఉండేది. ఇప్పుడు ఆ సమస్య రాదు. ఎందుకంటే ఇంటి వద్దకే సరుకులు వస్తుండటంతో ఆరోగ్యంగా ఉండొచ్చు.

– షేక్ జాన్‌బీ, గర్భిణీ, కారంచేడు

చాలా సంతోషంగా ఉంది..



డాక్టర్ వైఎస్సార్ సంపూర్ణ పోషణ మాలాంటి వారికి ఉపయోగపడుతుంది. మొన్నటివరకు అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లేవాళ్లం. గతంతో పోల్చితే ఇప్పుడిస్తున్న కిట్ల ద్వారా ఎంతో ఉపయోగంగా ఉంటుంది. మంచి పోషకాహారం అందించేలా ప్రభుత్వం చక్కటి పథకాన్ని అందుబాటులోకి తెచ్చింది. మాకు చాలా సంతోషంగా ఉంది.

– షేక్ రసుల్లాబీ, బాలింత, కారంచేడు

జులై 1 నుంచి జగనన్న సురక్ష క్యాంపులు

బల్లికురవ: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఎంపీడీవో సీహెచ్ కృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకంలో భాగంగా సచివాలయ, వలంటీర్లు సిబ్బందిచే ఇంటింటా సర్వే జరుగుతుందన్నారు.

జులై 1 నుంచి తహసీల్దార్ కే రవిబాబు ఈవోఆర్‌డీ డీ. సుమతి ఒక టీమ్ తాను డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్ మరో టీమ్ క్యాంపులతో 9 రకాల సర్టిఫికెట్లు, సంక్షేమ పథకాలు అందనివారికి అక్కడిక్కడే అందిస్తామని వివరించారు. జులై 1న బల్లికురవ, పెదఅంబడిపూడి, 4 న చెన్నుపల్లి, నక్కబొక్కలపాడు, 6న గుంటుపల్లి ముక్తేశ్వరం, 10న కొమ్మినేనివారిపాలెం, ఎస్ఎల్ గుడిపాడు 12న కొనిదెన ఉప్పుమాగులూరు2, 17న కొప్పరపాలెం, వైదన, 19న కొత్తూరు, వల్లాపల్లి, 21న కూకట్లపల్లి, వెలమవారిపాలెం, 24న మల్లాయపాలెం, వేమవరంలో జరిగే క్యాంపులను జయప్రదం చెయ్యాలని ఎంపీడీవో కోరారు.

నేడు కారంచేడులో స్పందన

కారంచేడు: మండల కేంద్రమైన కారంచేడు రెవెన్యూ కార్యాలయ ఆవరణలో సోమవారం ఉదయం ప్రజా సమస్యలపై స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహశీల్దార్ ఎస్ వెంకటరత్నం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు స్పందన, అనంతరం వీఆర్‌ఓల సమావేశం నిర్వహిస్తామన్నారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు ఆలయ భూములకు కౌలు వేలం

యద్దనపూడి: మండల పరిధిలోని పూనూరు గ్రూపు దేవస్థానం పరిధిలోని భూములకు సోమవారం ఉదయం 10 గంటలకు ఆయా ఆలయాల పరిధిలోని భూములకు బహిరంగ కౌలు వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎమ్. నాగయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పూనూరు వేణుగోపాలస్వామి ఆలయానికి సంబంధించి 26.90 ఎకరాలు, వీరభద్రదేవస్థానికి 36.02 ఎకరాలు, త్రిపురాతంకస్వామి దేవస్థానానికి 5.2 ఎకరాలు, కస్పాచెరువుకు సంబంధించి 17.30 ఎకరాలు, మున్నంగివారిపాలెం ఆంజనేయస్వామి దేవస్థానికి సంబంధించి 7.05 ఎకరాల భూములకు కౌలు వేలం పాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలం పాటలు అద్దంకి ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ శైలేంద్ర నాథ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనేవారు పాటకు ముందు రూ.5 వేలు ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొనాలని, వేలం పూర్తయిన వెంటనే పాడుకున్న రైతులు మెత్తం నగదు చెల్లించాలని తెలిపారు.

సంక్షేమం, అభివృద్ధే జగనన్న ధ్యేయం


సచివాలయాన్ని ప్రారంభిస్తున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

- సచివాలయం, రక్షిత పథక పైపులైన్ ప్రారంభం
- ప్రారంభించిన ఏపీ శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

బల్లికురవ: రాష్ట్రంలోని ప్రజల సంక్షేమం, గ్రామాలను మౌలిక వసతులతో అభివృద్ధి పరచటమే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ధ్యేయమని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. ఆదివారం మండలంలోని కొప్పెరపాలెంలో రూ. 40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని కె. రాజుపాలెంలో రూ. 40 లక్షలతో నిర్మించిన మంచినీటి పైపులైన్ శిలాఫలకాన్ని ఆవిష్కరణ చేశారు. కె. రాజుపాలెం బీసీ కాలనీ రూ. 10 లక్షలతో సామాజిక భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ ప్రజాసంకల్పయాత్రతో ప్రజలు, రైతులు నిరుద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు తెలుసుకుని గ్రామాల్లోనే సచివాలయం ఏర్పాటుతో ప్రభుత్వ సేవలు అందేలా చేశారన్నారు. రైతు భరోసాతో సబ్సిడీ పై ఎరువులు, విత్తనాలు, యంత్ర పరికరాలు అందించటంతోపాటు లక్షలాది మంది నిరుద్యోగులకు గ్రామాల్లోనే ఉపాధి అవకాశాలతో రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించారన్నారు. నాడు–నేడు తో పాఠశాలలు అభివృద్ధి చెయ్యటంతో మంచి ఫలాతాలు సాధింపచేసి ఆణిముత్యాలతో కనీవిని ఎరుగని రీతితో విద్యార్థులకు సత్కారాలతో పురస్కారాలు అందించారన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేని చంద్రబాబు, పవన్ కల్యాణ్‌తో కలిసి బురదజల్లే ప్రయత్నాలు చేసినా రెండోసారి జగనన్న సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని చైతన్య అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచు గరటయ్య, మండల కన్వీనర్, బాపట్ల జిల్లా రైతు అధ్యక్షుడు చింతల పేరయ్య, ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మీ, ఉపాధ్యక్షుడు ఐవీ సుబ్బారెడ్డి, కె రాజుపాలెం సొసైటీ అధ్యక్షుడు ఒంగోలు సుబ్బారావు, సర్పంచ్‌లు, వీ అమల, ఎల్ లక్ష్మి, స్థానిక నేతలు మేకల అంజిరెడ్డి, పెద్దిరెడ్డి అంజిరెడ్డి, కోటిరెడ్డి, అమర్నేని రమేష్, సతీస్, చింతల శ్రీనివాసరావు, మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కృష్ణచైతన్య

మంచి ఉద్యోగులుగా రాణించాలి

- మెగా జాబ్ మేళా విజయవంతం


జాబ్ మేళాలో మాట్లాడుతున్న ఆర్డీవో సరోజిని

చీరాల అర్బన్: కష్టపడి సాధించిన ఉద్యోగంలో ప్రతిభ కనబరచి మంచి ఉద్యోగులుగా రాణించాలని చీరాల ఆర్డీవో పి.సరోజిని అన్నారు. ఆదివారం స్థానిక గౌతమి విద్యాసంస్థలు, ఎస్ఎస్‌సి అకాడెమీ సంయుక్త ఆధ్వర్యంలో డిగ్రీ కాలేజీ ప్రాంగణంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్డీవో హాజరై మాట్లాడారు. పలు రకాల కంపెనీలను ఒకే చోటుకు తీసుకువచ్చి ఎంతో మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. డిగ్రీ పూర్తయిన తర్వాత మంచి ఉద్యోగం సంపాదించి జీవితంలో ఎదగాలనే ఎంతో మందికి ఇటువంటి జాబ్‌మేళాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కళాశాలల కరస్పాండెంట్ ఎంసీహెచ్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్య చెప్పడంతో పాటు ఉద్యోగాన్ని కూడా అందించేందుకు తమ విద్యాసంస్థ కృషి చేస్తుందన్నారు. జాబ్ మేళాలో ఎస్‌బీఐ, ఐసీఐసీఐ, అరబిందో, హెటిరో ల్యాబ్స్ తదితర 32 కంపెనీల ప్రతినిధులు జాబ్ మేళాలో పాల్గొని అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 783 మంది విద్యార్థులు పాల్గొనగా 257 మంది ఉద్యోగాలు సాధించారు. ఉద్యోగం పొందిన వారికి వెంటనే ఆఫర్ లెటర్ అందించారు. జాబ్ మేళాలో ఎస్ఎస్‌సి డైరెక్టర్ యర్రాకుల శ్రీనివాస్ యాదవ్, కళాశాల డైరెక్టర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కరాటే బెల్టుల ప్రదానం


బెల్టులు సాధించిన విద్యార్థులు

ఇంకొల్లు (చినగంజాం): వేసవి కరాటే శిక్షణ తరగతుల్లో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన కరాటే శిక్షణ అభ్యాసకులకు ఆదివారం బెల్ట్ టెస్ట్ పరీక్ష నిర్వహించారు. ఇంకొల్లు జెడ్పీ ఉన్నత పాఠశాలలోని ఎన్టీఆర్ కళా ప్రాంగణంలో కరాటే శిక్షకుడు తేళ్ల అంకమ్మ చౌదరి ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షలో విజేతలకు బెల్ట్ ప్రదానం చేశారు. 20 మంది విద్యార్థులు శిక్షణ తీసుకోగా వారిలో ఎనిమిది మంది బ్రౌన్ బెల్ట్, బ్లూ బెల్ట్ ఒకరికి, ఆరుగురికి ఆరెంజ్, ఐదుగురికి గ్రీన్‌బెల్ట్‌లు అందజేశారు. అనంతరం శిక్షకుడు మాట్లాడుతూ వేసవి కరాటే శిక్షణ తరగతులు శారీరక ఎదుగుదలకు, మానసిక వికాసానికి ఉపయోగపడుతుందని వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేయాలి


ఎంపీ మోపిదేవితో సమావేశమైన నాయకులు

యద్దనపూడి: నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలని రాజ్యసభ సభ్యుడు, జిల్లా పార్టీ అధ్యక్షుడు మోపిదేవి వెంకటరమణ పేర్కొన్నారు. ఆదివారం మార్టూరు, యద్దనపూడి మండలాల నాయకులు మర్యాద పూర్వకంగా ఆయన నివాసంలో కలిశారు. మండలాల్లోని స్థానిక సమస్యలు, పార్టీ పరిస్థితి గురించి చర్చించారు. కార్యక్రమంలో మార్టూరు, యద్దనపూడి మండలాల్లోని ప్రజా ప్రతినిధులు, పార్టీ మండల అధ్యక్షులు, నాయకులు, అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు.

శివాలయ నూతన కార్యవర్గం ఎన్నిక


పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న వెంకటేష్

చీరాల: పట్టణంలోని నల్ల గాంధీబొమ్మ సెంటర్‌లోని గంగా భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థాన నూతన కార్యవర్గం ఎన్నికైన సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. పూజా కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో దేవస్థాన గౌరవ అధ్యక్షులు స్వర్ణ మల్లికార్జునప్రసాద్, అధ్యక్షుడు కే పాపారావు, ప్రధాన కార్యదర్శి జీవీజీ రాజు, సలహా సభ్యులు వ్యవసాయ సలహామండలి సభ్యులు పులి వెంకటేశ్వర్లు, మాఘం మురళి, హనుమకొండ శివ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తి అరెస్టు

చినగంజాం: అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని చినగంజాం పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. ఎస్సై కే సురేష్ అందించిన సమాచారం మేరకు.. మండలంలోని కడవకుదురు గ్రామానికి చెందిన పఠాన్ మస్తాన్ అనే వ్యక్తి మండలంలోని ప్రభుత్వ షాపుల వద్ద మద్యం సీసాలు కొనుగోలు చేసి గ్రామంలోని జాతరలో వాటిని అమ్ముకునేందుకు తెచ్చి పెట్టుకున్నాడు. ఆదివారం ఉదయం పోలీసులకు సమాచారం రావడంతో ఎస్సై తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించగా 12 బ్రిలియంట్ బ్రెండ్ విస్కీ, 13 దారు హౌస్ బ్రాందీ సీసాలు మొత్తం 25 మద్యం బాటిళ్ల రూ.3750 విలువ కలిగినవి అతని వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నారు. అతనిని అరెస్టు చేసి కోర్టుకు తరలించగా కోర్టు అతనికి రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.

నేడు అద్దంకి మున్సిపాలిటీ సమావేశం

అద్దంకి రూరల్: అద్దంకి మున్సిపాలిటీ సాధారణ సమావేశం స్థానిక కౌన్సిల్ హాలులో సోమవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు అద్దంకి మున్సిపల్ చైర్మన్ ఎల్ ఎస్తేరమ్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి కౌన్సిల్ సభ్యులు హాజరు కావాలని కోరారు.

స్వామినాథన్ కమిషన్‌ను అమలుచేయాలి


రైతుల సమస్యలపై మాట్లాడుతున్న కృష్ణయ్య

పర్చూరు (చినగంజాం): వ్యవసాయాన్ని కాపాడాలంటే స్వామినాథన్ కమిషన్ అమలు చేయాలని రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు వలేటి కృష్ణయ్య అన్నారు. స్థానిక చీరాల రోడ్డులోని సీపీఎం కార్యాలయంలో ఈ నెల 30 రాష్ట్ర కేంద్రమైన విజయవాడలో రైతు సంఘం ఆధ్వర్యంలో రైతు సమస్యలపై చేయు మహాధర్నా సందర్భంగా పర్చూరు తదితర ప్రాంతాల రైతు సమస్యలపై ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షులు బండి శంకరయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతాల వారీగా రైతు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంటల బీమా పథకం అమలు చేయాలని ఇన్‌పుట్ సబ్సిడీ రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నల్లమడ రైతు సంఘం నాయకులు కరిశెట్టి ఆచార్యులు, జిల్లా సంఘం సహాయ కార్యదర్శి వీ శ్రీనివాసరెడ్డి రైతులు పాల్గొన్నారు.

ఇంట్లో నగదు చోరీ

చీరాల: చీరాల మండలం ఈపూరుపాలెంలో శనివారం చోరీ జరగగా ఈ మేరకు చీరాల రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. గ్రామంలో నివశించే షేక్ కరీమున్, ఆమె కుమారుడు శనివారం ఉదయం పని నిమిత్తం ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చారు. ఇంటి వెనుక వైపు తలుపులు తెరచి ఉండటాన్ని గమనించి ఇంట్లో పరిశీలించగా బీరువాలో ఉండాల్సిన రూ.68 వేలు నగదు కనిపించలేదు. దీంతో చోరీ జరిగిందని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జనార్దన్ తెలిపారు.

12 సెల్‌ఫోన్లు చోరీ..

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని ఆంజనేయ సెల్ దుకాణంలో 12 సెల్‌ఫోన్లు చోరీకి గురయ్యాయని ఆదివారం పోలీసులు తెలిపారు. ఎస్సై నాగశివారెడ్డి వివరాల మేరకు.. దుకాణంలో శనివారం రాత్రి షాపువెనుక భాగంలో కిటికీలను తొలగించి దుండగులు సెల్‌ఫోన్లను తస్కరించారన్నారు. వీటి విలువ సుమారు రూ.1 లక్షపైనే ఉంటుందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చెప్పారు.